ANGRAU

కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

भाकृअनुप
ICAR

కృష్ణా కర్షక మాస పత్రిక



Krishi Vigyan Kendra Ghantasala

Acharya N.G. Ranga Agricultural University, Lam, Guntur

ICAR ATARI Zone-X, Hyderabad

సంచిక:- 4 / మాసము:- నవంబర్,2026

నవంబర్ మాసంలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలు

తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, నీరు నిల్వ ఉండటం, బలమైన గాలులు, పంటలు పడిపోవడం వంటి పరిస్థితుల వల్ల కోతకు సిద్ధమైన పంటలకు నష్టం కలిగే అవకాశం ఉంది. కాబట్టి రైతులు పంట దశను బట్టి ముందస్తు చర్యలు తీసుకోవాలి.



వరి

కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండి, పంట తేమ తగ్గినప్పుడు వీలైనంత త్వరగా కోత పూర్తి చేయాలి.



పంట పడిపోయినట్లయితే నీటిని త్వరగా తొలగించే చర్యలు తీసుకోవాలి. వర్షాల సమయంలో యూరియా లేదా ఇతర ఎరువుల పైపూతను వాయిదా వేయాలి.



నీరు తగ్గిన తర్వాత పంటను పరిశీలించి, తెగుళ్లు లేదా పురుగుల లక్షణాలు కనిపించినప్పుడే శాస్త్రవేత్తల సలహాతో చర్యలు తీసుకోవాలి.



ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాలలో వర్షాల అనంతరం మురుగునీటిని బయటకు పంపిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా మరియు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి.



పాము పొడ తెగులు లేదా కాండం కుళ్లు తెగులు లేదా పొట్ట కుళ్లు తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

తేమ ఎక్కువగా ఉన్నప్పుడు మానిపండు తెగులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



కోసిన పనలను పొలాల్లో వదిలేయకుండా సురక్షితమైన ఎత్తైన ప్రదేశానికి తరలించాలి. కోసిన ధాన్యాన్ని టార్పాలిన్లపై ఉంచి వర్షం, గాలుల నుంచి రక్షించాలి. ధాన్యాన్ని నేరుగా నేలపై ఉంచకూడదు.



పత్తి

పక్వానికి వచ్చిన పత్తి కాయలను వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు ఏరి, పొడి ప్రదేశంలో భద్రపరచాలి. తడిసిన పత్తిని ఇతర పొడి పత్తితో కలపకూడదు. బాగా ఆరిన తర్వాతే నిల్వ చేయాలి.

నీరు నిల్వ ఉండకుండా కాలువలను తెరిచి ఉంచాలి. మొక్కలు వాలిపోకుండా వీలైనచోట మద్దతు కల్పించాలి. వర్షాల అనంతరం పింక్ బోల్‌వార్మ్, తామర పురుగులు, ఇతర కాయ మరియు ఆకుల తెగుళ్లను పరిశీలించాలి.

వర్షం కురుస్తున్నప్పుడు పురుగుమందులు పిచికారీ చేయకూడదు. గాలి వేగం తగ్గి, ఆకులు ఆరిన తర్వాత మాత్రమే అవసరాన్ని బట్టి పిచికారీ చేయాలి.

మొక్కజొన్న

పొలంలో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలను సిద్ధం చేయాలి. బలమైన గాలుల వల్ల మొక్కలు పడిపోకుండా పొలాన్ని పరిశీలించాలి.

కోతకు సిద్ధమైన కంకులను వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు కోసి సురక్షితంగా ఆరబెట్టాలి. వర్షాల తర్వాత కాండం కుళ్లు, ఆకుల వ్యాధులు, కత్తెర పురుగు లక్షణాలను పరిశీలించాలి.

అవసరం లేని పురుగుమందుల పిచికారీని నివారించాలి.

వేరుశనగ

కోత దశలో ఉన్న పంటను నేల తేమ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించి, కోత పనులను జాగ్రత్తగా నిర్వహించాలి.

అధిక నీరు నిల్వ ఉండకుండా పొలంలో నీటి పారుదల సదుపాయాలను కల్పించాలి. వర్షాల తర్వాత టిక్కా ఆకు మచ్చ తెగులు, కాండం లేదా వేరు కుళ్లు లక్షణాలను గమనించాలి.

కోసిన కాయలను వర్షానికి తడవకుండా రక్షించి, బాగా ఆరిన తర్వాతే నిల్వ చేయాలి.

మినుము, పెసర, కంది మరియు ఇతర పప్పుధాన్యాలు

పంటల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలను శుభ్రం చేయాలి. ముఖ్యంగా పప్పుధాన్యాలు నీటి ఎద్దడిని కొంత తట్టుకున్నప్పటికీ, నీరు నిల్వ ఉండటాన్ని సరిగా తట్టుకోలేవు.

కోతకు సిద్ధంగా ఉన్న పంటను పొలంలో ఎక్కువకాలం ఉంచకుండా, అనుకూలమైన వాతావరణంలో కోత చేపట్టాలి.

వర్షాల తర్వాత వేరు కుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లు, కాయ తొలుచు పురుగుల లక్షణాలను పరిశీలించాలి.

తడిసిన కాయలు, గింజలను పూర్తిగా ఆరబెట్టకుండా నిల్వ చేయకూడదు.

ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పసుపులో దుంప కుళ్లు, కందలో కాండం మొదలు కుళ్లు, బొప్పాయిలో కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని 3 గ్రా./లీ. నీటికి కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి.



ఆకు మచ్చ తెగులు నివారణకు కార్బండజిమ్ 1 గ్రా./లీ. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా./లీ. కలిపి పిచికారీ చేసుకోవాలి. బ్యాక్టీరియా మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. + స్ట్రెప్టోసైక్లిస్ 0.1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



వర్షాలు తగ్గాక 2% యూరియా (20 గ్రా./లీ.) 2 నుంచి 3 సార్లు లేదా పొటాషియం నైట్రేట్‌ను 1% (10 గ్రా./లీ.) ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని 5 గ్రా./లీ. నీటికి కలిపి వారం వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.



పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా పారుదల ఏర్పాట్లు చేయాలి. తీగజాతి కూరగాయలకు ఏర్పాటు చేసిన పందిళ్లు, మద్దతు కర్రలను బలపరచాలి.



అరటి, బొప్పాయి వంటి గాలి ప్రభావానికి సులభంగా దెబ్బతినే పంటలకు అవసరమైన చోట మద్దతు/ ఊతను కల్పించాలి.



పండిన పండ్లు, కోతకు సిద్ధంగా ఉన్న కూరగాయలను వాతావరణం అనుకూలంగా ఉంటే కోసి సురక్షితంగా నిల్వ చేయాలి.

పశుసంపదలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



తుఫాను దృష్ట్యా కోళ్లు, పశువుల షెడ్లను పొడిగా ఉంచుకోవాలి

శుభ్రమైన నీరు మరియు నాణ్యమైన మేత అందించాలి.

టీకాలు సకాలంలో వేయించడం, వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించడం ద్వారా పశుసంపద ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు మరియు నష్టాలను తగ్గించవచ్చు.



రొయ్యల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



నీటి నాణ్యత: pH, ఆల్కలినిటీ, కరిగిన ఆక్సిజన్ (DO), లవణీయతను క్రమం తప్పకుండా పరిశీలించాలి.

మేత నిర్వహణ: వాతావరణ పరిస్థితులను బట్టి మేత పరిమాణాన్ని తగ్గించి, నిపుణుల సూచనల మేరకు విటమిన్ సి, ప్రోబయోటిక్స్, ఆర్గానిక్ ఆమ్లాలను వినియోగించాలి.



pH నియంత్రణ: pH స్థాయిని పర్యవేక్షిస్తూ, అవసరాన్ని బట్టి అగ్రికల్చరల్ లైమ్‌ను నిపుణుల సూచనల మేరకు వాడాలి.



ఆక్సిజన్ నిర్వహణ: DO స్థాయి తగ్గకుండా ఏరేటర్లను నడపాలి. విద్యుత్ అంతరాయాల కోసం జనరేటర్‌ను సిద్ధంగా ఉంచాలి

ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు



అధిక వర్షాలు కురిసే సమయంలో శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలి. వేడిగా, తాజాగా వండిన ఆహారాన్ని తీసుకోవాలి.



పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి ఉపయోగించాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి మరియు దోమల నివారణకు దోమతెరలు ఉపయోగించాలి.

జ్వరం, జలుబు, దగ్గు, విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.



పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం తీసుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వర్షాల వలన వచ్చే వ్యాధులను నివారించవచ్చు.